# విచ్చలవిడిగా...
# గుడుంబా అమ్మకాలు..!



-మండలంలోని బద్దు తండా, కొత్త తండాలో గుడుంబా తయారీ

-గ్రామాల్లో ఏరులై పారుతున్న గుడుంబా

-కట్టడి చేసే వారెవ్వరూ..?

**టేకులపల్లి, జూన్ 10, ప్రజాజ్యోతి:**

గత కొన్ని ఏళ్ల క్రితం కనుమరుగైన నాటు సారా (గుడుంబా) మళ్ళీ మండలంలో ఎరులై పరుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదనే చెప్పొచ్చు. మండలంలోని బద్దు తండా, కొత్త తండాలో విచ్చలవిడిగా గుడుంబా తయారు చేస్తున్నట్టు పక్కా సమాచారం. అక్కడ తయారైన గుడుంబా బి కాలనీలో గుట్టుచప్పుడు అమ్మకాలు చేస్తున్నట్టు తెలుస్తుంది. మండలంలో ఎక్కువగా కూలి పనులు చేసే అమాయక ప్రజల అలవాటును ఆసరాగా చేసుకోని ఈ గుడుంబా దందాకు శ్రీకారం చుట్టారు. ఇంతలా మండలంలో జరుగుతున్న గుడుంబా దందా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సదరు గుడుంబా 2లో ▶



ప్రజాజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 11 | జూన్ | 2024 | పేజీలు : 6



■ కొత్తగూడెం, ప్రజాజ్యోతి

# అనుమతులు నిల్...
# ఆకర్షణ ఫుల్...

ఏజెన్సీ చట్టాలు బడా బాబులకు చుట్టాలుగా మారిపోతున్నాయి. అధికారుల అలసత్వంతో ప్రభుత్వ భూములు రోజురోజుకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబంధహస్తాల్లో చిక్కుకుపోతున్నాయి. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదంటూ మాట్లాడే అధికారులు చోటామోటా కబ్జాదారుల పై కేసులు పెట్టి చేతులు దులుపుకుంటున్నారే తప్ప అసలైన బడా బాబులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు వారికే తెలియాలి.

2 లో

- రేగళ్లలో రియల్ ఎస్టేట్ మాయాజాలం
- ఏజెన్సీ చట్టాలకు మంగళం..
- 25 ఎకరాల్లో ప్లాట్లు చేస్తున్న బడాబాబులు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు





# ఇల్లందుపై అధికారులకు...
# కనికరమెందుకో..?

- రెస్టారెంట్స్, హోటల్ లలో తనిఖీలు ఎక్కడ..!
- నాణ్యత ప్రమాణాలపై పట్టింపు లేదా..?
- కానరాని ఫుడ్ సేఫ్టీ అధికారులు
- కమర్షియల్ సిలిండర్ల వినియోగం శూన్యం..!
- డోమెస్టిక్ సిలిండర్లతోనే నిర్వహణ..!
- అధికారులకు ఇల్లందు కనిపించడం లేదా..?
- విచ్చలవిడిగా గ్యాస్ సిలిండర్ల వినియోగం
- గ్యాస్ సిలిండర్లు ఎక్కడ నుండి సరఫరా అవుతున్నాయో...!
- ఏమైనా లోపాయికారి ఒప్పందమే కారణమా..?
- ఉన్నతాధికారులు జర దృష్టి సారించరూ..

**ఇల్లందు, జూన్ 10, ప్రజాజ్యోతి**

పెట్టేవాడు మనవాడైతే ఏ మూలకు కూర్చున్న కడుపు నిండా పెడతాననే నాడుడి మాట ఫుడ్ సేఫ్టీ, పౌర సరఫరాల శాఖ అధికారుల తీరుకు అద్దం పడుతుందనేది స్పష్టమవుతుంది. గత కొన్ని రోజుల హైదరాబాదులో పలు రెస్టారెంట్స్, హొటల్స్ పై రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక దాడులు చేయడంతో ఎన్నో విషయాలు వెలుగులోకి రావడం జరిగింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని సుమారుగా అన్ని జిల్లాల్లోని రెస్టారెంట్స్, హొటల్స్ పై ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేసి నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించడం జరిగింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు ప్రాంతాల్లో సైతం తనిఖీలు చేపట్టారు. కానీ సంబంధిత అధికారులకు ఇల్లందు పై ఎందుకంత ప్రేమో అర్థం కానీ పరిస్థితి. ఇప్పటివరకు ఇల్లందులోని రెస్టారెంట్స్, హోటల్స్ పై మిగతా 2 లో.. ▶

# అనుమతులు నిల్.. ఆకర్షణ ఫుల్...

కొత్తగూడెం, జూన్ 10, ప్రజాజ్యోతి

అదిరిపోయే హోర్డింగ్ బోర్డులు, ఆకర్షించే ఆఫర్లు తక్కువ రేట్లకే విలువైన ప్లాట్లు అంటూ ప్రచారం అదరకొడుతూ ఏజెన్సీ ప్రాంతంలో అనుమతులు లేని వెంచర్లుకు అమ్మకాలు చేపడుతున్నారు. సొంత ఇండ్లు లేని మధ్య తరగతి ప్రజలు ఎన్నో ఏండ్లుగా దాచుకున్న సొమ్ముతో మంచి ప్లాట్ కొనుక్కుందామని అనుమతులు లేని వెంచర్లు వేస్తూ ప్లాట్లు అమ్ముతున్న దళారుల చేతుల్లో చిక్కి మోసపోతున్నారు. ఇలాంటి వెంచర్లు ఏజెన్సీ మండలాలైన లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండలాలలో వెలుస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే తరహాలో లక్ష్మీదేవి పల్లి మండలం లోని ఏజెన్సీ ప్రాంతంలో ఓ వెంచర్ తమ వ్యాపార కార్యక్రమాలు ప్రారంభించేందుకు పావులు కదుపుతోంది. ఈవెంచర్ యొక్క ప్రాధాన్యత కలెక్టరేట్ కు కూతవేటు దూరమంటూ ప్రచారం పెద్దయెత్తున సాగుతోంది. వెంచర్ కు సంబంధించిన వివరాలు సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతున్నాయి.



**25 ఎకరాల్లో ప్లాట్లు చేస్తున్న రియల్ ఎస్టేట్ నిర్వాహకులు..**

లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పంచాయతీ సర్వేనెంబర్ 98/ 2 లో రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహించే కొందరు వ్యక్తులు 4. 1/2 ఎకరాలకు డిపార్ట్మెంట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డిటిసిపి) అనుమతులు పొందినట్లు సమాచారం. అయితే పక్కనే గల మరో 21 ఎకరాల భూమిని అమాయకమైన గిరిజనుల దగ్గర నుండి కొనుగోలు చేసిన నిర్వాహకులు ఏకంగా మరో 21 ఎకరాల్లో ప్లాట్లు చేసి అమ్మకాలు చేపట్టేందుకు సన్నద్ధమైనట్లు తెలుస్తోంది.

ఇప్పటికే ఆయా పనుల్లో కొందరు రైతులను కూలీలుగా మార్చి పనులు చేయిస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. కోట్లు విలువ చేసే భూమిని గిరిజనుల దగ్గర నుండి నయాన భయానో ముట్టజెప్పి వారి హస్తగతం చేసుకొని బడా బాబులు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అంతకు అంత ఎదిగిపోతున్నారు. లక్షలు పెట్టుబడి పెడితే కోట్లు సంపాదించాలనే వ్యూహంతో గిరిజనుల భూములను తక్కువ ధరలకు కొనుగోలు చేసి బినామీ పత్రాలు సృష్టించి కోట్ల రూపాయలు దండుకుంటున్నారనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

**ఏజెన్సీ చట్టాలకు మంగళం..**

కొత్తగూడెం నియోజకవర్గం లోని లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండలాల్లో రియల్ ఎస్టేట్ దందా జోరుగా కొనసాగుతుంది. ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కి గిరిజన, ప్రభుత్వ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసుకుంటూ బడా బాబులు కోట్లకు పడగలెత్తుతున్నారు. ఇంత జరుగుతున్న జిల్లా రెవిన్యూ ఉన్నత స్థాయి అధికారులు వ్యవహరిస్తున్న తీరు వారి విశ్వసనీయతను ప్రశ్నించేలా చేస్తుంది. అంతేకాక అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే నేపథ్యంలో జిల్లా యంత్రాంగం కొంత పక్షపాత ధోరణి అవలంబిస్తుందని అపవాదులు కూడా ఉన్నాయి.

ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులు 1/70 యాక్ట్ చట్టాలను ఉల్లంఘించి అక్రమ పట్టాలు పొంది కోట్లు విలువ చేసే గిరిజనుల భూములు వారి హస్తగతం చేసుకున్నారు. ఏజెన్సీ లో గిరిజన భూములను క్రయవిక్రయాలు చేయకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ అధికారుల అలసత్వంతో అన్నీ జరిగిపోతూనే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అడ్డుకట్ట వేసి ఏజెన్సీ చట్టాలను పరిరక్షించాలని గిరిజన ప్రజలు కోరుచున్నారు.

# ఇల్లందుపై అధికారులకు కనికరమెందుకో..?

(మొదటి పేజీ తరువాయి)


నామామాత్రంగా తనిఖీలు చేసిన దాఖలాలు లేవనేది వాస్తవం. మరి ముఖ్యంగా రెస్టారెంట్స్, హోటల్ లలో సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టి నాణ్యత ప్రమాణాలు పాటించాలని చెప్పిన దాఖలాలు లేవని ఇల్లందులో జోరుగా ప్రచారం జరుగుతుంది. అసలు రెస్టారెంట్స్, హోటల్ లలో నాణ్యమైన ఆహార పదార్థాలు వాడుతున్నారా అనేది కూడా పరిశీలించకపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా రెస్టారెంట్స్, హోటల్ లలో ఎలాంటి వస్తువులు వాడాలో.. ఏవి వాడకూడదో తనిఖీలు చేపట్టి సంబంధిత నిర్వాహకులకు సూచనలు చేయాల్సిన వారే కరువయ్యారనే విమర్శలు ఉన్నాయి. ఇంత వరకు బాగానే ఉన్న అసలు రెస్టారెంట్స్, హోటల్స్ లలో డొమెస్టిక్ సిలిండర్లు ఉపయోగించాల్సి ఉన్నప్పటికీ కేవలం కమర్షియల్ సిలిండర్లతోనే కొనసాగించడం గమనార్హం. నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నప్పటికీ ఆ శాఖ అధికారులకు కనిపించడం లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇల్లందులోని రెస్టారెంట్స్, హోటల్స్ కు రోజుకు సుమారుగా 100 కమర్షియల్ సిలిండర్లు వాడుతున్నట్లు సమాచారం. అసలు గ్యాస్ ఏజెన్సీ ల నుంచి రోజుకు వందల సంఖ్యలో గ్యాస్ సిలిండర్లు దొడ్డిదారిలో రవాణా చేస్తున్నారా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా గ్యాస్ ఏజెన్సీలకు ఎంతమంది వినియోగదారులు ఉంటే అన్ని సిలిండర్లను మాత్రమే సరఫరా చేయడం జరుగుతుంది. కానీ చాలా వరకు ఒక్కో వినియోగదారుడు నెలకు ఒక్క సిలిండర్ వాడకపోవడం వల్ల ఏజెన్సీల నిర్వాహకులు వాటిని రెస్టారెంట్స్, హోటల్ లకు మళ్లీస్తున్నట్లు తెలుస్తుంది. రెస్టారెంట్స్, హోటల్ లలో సిలిండర్ల వినియోగంపై అధికారులు దృష్టి సారించకపోవడం వల్ల ఏమైనా లోపాయికారి ఒప్పందం జరిగిందా అనే ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత ఫుడ్ సేఫ్టీ, పౌర సరఫరాల శాఖ అధికారులు రెస్టారెంట్స్, హోటల్ లలో ఆకస్మిక దాడులు చేయాలని లేని యెడల ఆ శాఖపై వస్తున్న ఆరోపణలు నిజమయ్యే అవకాశం లేకపోలేదు.

# విచ్చలవిడిగా... గుడుంబా అమ్మకాలు..!

(మొదటి పేజీ తరువాయి)

తయారుదారులు మధ్యవర్తుల ద్వారా మండలంలో పలు ప్రాంతాలకు రవాణా చేసి జోరుగా అమ్మకాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇప్పుడిప్పుడే మధ్య తరగతి జీవితాలు మెరుగుపడుతున్న తరుణంలో గుడుంబా మహమ్మరి వల్ల వారి బతుకులు అందకారంలోకి నెట్టివేసే పరిస్థితి లేకపోలేదు. గతంలో ఈ గుడుంబాకు బానిసలై భార్యల పుస్తెలతాడులతో పాటు ఇంట్లో ఉన్న వస్తువులు కుదవ పెట్టి ఆరోగ్యాలను నాశనం చేసుకోవడం అందరికి తెలిసిందే. అధికారులు ఈ గుడుంబా దందాకు కళ్లెం వేయకపోతే మరల అలాంటి పరిస్థితులు రావడం ఖాయమని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి మండలంలో మొదలైన గుడుంబా దందాకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# టిఫనీ కహానీ



మహిళలు ఎక్కువగా మక్కువ చూపించే అంశాల్లో ఆభరణాలదే అగ్రస్థానం. శుభకార్యాలు, పండగలు, పార్టీలు.. సందర్భం ఏదైనా మహిళలు తమ అభిరుచికి తగ్గట్టు రకరకాల నగలు ధరించి వగలు పోతుంటారు. మగువల మనసు దోచేందుకు ఎప్పటికప్పుడు కొత్త కొత్త డిజైన్లను రూపొందిస్తూనే ఉంటారు తయారీదారులు. వినూత్న నగలను రూపొందించడంలో ప్రపంచ ప్రఖ్యాతి గడించిన టిఫనీ మరో వెరైటీ సిరీస్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఎప్పటికప్పుడు ముచ్చటైన నగలతో మహిళల మనసులు దోచే టిఫనీ మరో యాంటిక్ డిజైన్లతో ముందుకొచ్చింది. గ్రీకు నాగరికత ఆధారంగా ఆభరణాలను రూపొందించి అతివలోకాన్ని అచ్చెరువులో ముంచేసింది. తాజాగా మార్కెట్లో విడుదల చేసిన 'టైటాన్' రకం ఆభరణాలు.. ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉన్నాయి. గ్రీకు పురాణాల్లో సముద్రున్ని టైటాన్ అని పిలుస్తారు. ఆ పేరుతో ఈ నగలను రూపొందించారు. సముద్ర దైవం పోసిడాన్ మోసుకెళ్లిన త్రిశూలం స్ఫూర్తితో వీటిని తయారు చేశారు. శూలం డిజైన్ చెవికమ్మలు, బ్రేస్‌లెట్లు, ఉంగరాలు, గొలుసులను అందుబాటులో ఉంచారు. వీటి తయారీలో బంగారంతోపాటు టైటానియం కూడా ఉపయోగిస్తున్నారు. వాటిపై వజ్రాలు, ఇతర రత్నాలను అమర్చి మరిన్ని వన్నెలు అద్దుతున్నారు. టైటాన్ నగలో మొత్తం 19 ముక్కలు ఉంటే.. వాటిలో ఏడింటిని టైటానియంతో చేయగా, మిగిలిన వాటిని ఎల్లో గోల్డ్‌తో తయారు చేశారు. బ్లాక్ టైటానియంతో రూపుదిద్దుకున్న గొలుసులు, కర్ణాభరణాలు రిచ్ లుక్‌లో దర్శమిస్తున్నాయి. వజ్రాలు, రాళ్ళు పొదిగినవి రూపొందినవి కూడా ఆధునిక మహిళలను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా మోడ్రన్ దుస్తుల మీదకి ఈ జువెలరీ చక్కగా నప్పుతుంది. అంతేకాదు వీటిని పురుషులు కూడా ధరించవచ్చు. ఈ వెరైటీ ఆభరణాలను టిఫనీ అధికారిక వెబ్‌సైట్‌తోపాటు ఇతర ఆన్‌లైన్ స్టోర్స్‌లోనూ కొనుగోలు చేయొచ్చు.

# నారియల్ కాంతి

**ముఖం మీద మచ్చలా? పది నిమిషాలు బయటికి వెళ్లొస్తే చర్మం పాలిపోతున్నదా? మొటిమలతో సతమతమవుతున్నారా..? వీటన్నిటికీ ఒకే ఔషధం కొబ్బరి నూనె. తలకు రాసుకునే నారియల్ ఆయిల్‌కు కొన్ని పదార్థాలను మేళవించి ముఖానికి రాసుకుంటే.. మేలైన సౌందర్యం మీ వశమవుతుంది.**





ఒక గిన్నెలో ఒక టేబుల్ స్పూన్ కొబ్బరి నూనెను తీసుకోవాలి. ఇందులో అర టేబుల్ స్పూన్ కాఫీ పొడర్ వేసి పేస్ట్ లాగా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుని అరగంట పాటు అలాగే ఉంచాలి. తర్వాత చల్లటి నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. వారానికి ఒకటిరెండుసార్లు చేయడం వల్ల చర్మంపై పేరుకుపోయిన మృతకణాలు తొలగిపోతాయి. ముఖం కాంతిమంతంగా తయారవుతుంది. ఒక గిన్నెలో ఒక టీ స్పూన్ కొబ్బరి నూనె, ఒక టీ స్పూన్ ఆలివ్ నూనె వేసి ముఖానికి బాగా పట్టించాలి. తరువాత చర్మంలోకి నూనె ఇంకేలా సున్నితంగా మర్దనా చేసుకోవాలి. అరగంట తరువాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి మూడు సార్లు చేయడం వల్ల ముఖంపై ముడతలు తొలగిపోతాయి.

# మావోయిస్టుల దుశ్చర్యల వలన ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు

### ఆదీవాసీలు సంచరించే ప్రదేశాల్లో అమర్చిన బూబీ ట్రాప్స్..

### స్వాదీనం చేసుకున్న పోలీసులు..



**కొత్తగూడెం క్రైమ్, జూన్ 10, ప్రజాజ్యోతి:**

చర్ల మండలంలోని పూసుగుప్ప అటవీ ప్రాంతం మరియు తెలంగాణ -చత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుగా గల ప్రాంతాలలో చర్ల పోలీసుల ఆధ్వర్యం లో భద్రాద్రి కొత్తగూడెం స్పెషల్ పార్టీ,చతీస్ఘడ్ పోలీసులు మరియు సీఆర్పీఎఫ్ పోలీసులు సోమవారం సంయుక్తంగా నిర్వహించిన ఏరియా డామినేషన్ ఆపరేషన్లో పోలీసులను హతమార్చడమే లక్ష్యంగా చేసుకొని నిషేధిత సిపిఐ మావోయిస్టులు సరిహద్దు ప్రాంతాల్లోని ఆదివాసీలు మరియు వారికి సంభందించిన జంతువులు సంచరించే ప్రదేశాలలో అమర్చిన 70 బూబీ ట్రాప్స్ ను గుర్తించారు. మావోయిస్టులు గుంత లు త్రవ్వి ఏర్పాటు చేసిన 70 బూబీ ట్రాప్స్ నుంచి 4396 పదునైన ఇనుప కడ్డీలను తొలగించి వాటిని స్వాదీనం చేసుకున్నారు. నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ నాయకులు ఆదివాసీలకు మంచి చేస్తున్నామని చెబుతూ వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లిలా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం దురదృష్టకరమని అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయి మనోహర్ మరియు భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ ఈరోజు సంయుక్తంగా ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ-ఛత్తీస్గడ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో నివసించే అమాయకపు ఆదీవాసీ ప్రజలు మావోయిస్టుల దుశ్చర్యల వలన నిత్యం బిక్కు బిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఆదివాసీలు, జంతువులు సంచరించే ప్రాంతాలలో వారు అమర్చిన ఐఈడీస్, బూబీ ట్రాప్స్ వలన ఇప్పటికే చాలామంది ప్రాణాలను కోల్పోవడం, తీవ్రంగా గాయాల పాలవ్వడం జరుగుతుందని అన్నారు. కావున సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవల ములుగు జిల్లా వెంకటాపురం ఏరియాలోని జగన్నాధపురం గ్రామానికి చెందిన యేసు అనే వ్యక్తి మావోయిస్టులు అమర్చిన మందు పాతర పేలి మరణించడం కూడా జరిగిందని తెలిపారు. ఆదివాసిల కోసమే మా పోరాటం అంటూ నీతులు వల్లించే మావోయిస్టు నాయకులు వ్యవసాయ రీత్యా,అటవీ ఉత్పత్తుల సేకరణలో భాగంగా సంచరించే ఆదివాసీలకు తీవ్ర నష్టం కలిగేలా చేస్తున్నారన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజలకు జరిగే నష్టానికి పూర్తి బాధ్యత మావోయిస్టు పార్టీ వహించాలని అన్నారు. తెలంగాణ- ఛత్తీస్గడ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజల సంక్షేమం, అభివృద్ధి కొరకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ సారథ్యంలో జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని తెలియ జేసారు. అభివృద్ధి నిరోధకులుగా మారిన నిషేధిత మావోయిస్టులకు ఎవ్వరూ సహకరించవద్దని వారు విజ్ఞప్తి చేశారు.

# పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ స్థల పరిశీలన



**ఇల్లందు, జూన్ 10, ప్రజాజ్యోతి:**

సింగరేణి సంస్థ ఏరియాలోని జేకే ఓసీలో సింగరేణి సంస్థ నూతనంగా ఏర్పాటు చేయనున్న పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ స్థలం కొరకు సోమవారం కార్పొరేట్ ప్రాజెక్ట్ ప్లానింగ్ టీం ఏరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా టీం సభ్యులు ఏరియా జీఎం జాన్ ఆనంద్‌తో కలిసి పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ కోసం అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పోరేట్ టీం మాట్లాడుతూ పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్, సహజ వనరులను వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేస్తుందన్నారు. ఈ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లయితే, ఇల్లెందు ఏరియా మనుగడకు దోహదపడుతుందని, ఇల్లెందుకు పూర్వ వైభవం వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జియం సిపి అండ్ పి రవికుమార్, జియం సర్వే జైనువుద్దిన్, ఈ అండ్ ఎం ఏజియం బిడివి ప్రసాద్, సీనియర్ ఇంజనీర్లు నటరాజ్, నటరాజ్ ప్రసాద్, నాగేంద్ర కుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ నరసింహ రాజు, డిజియం సర్వే బాలాజీ నాయుడు, ఎస్టేట్ అధికారి శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమంలో పాలు, పండ్లు ,బ్రెడ్ పంపిణీ

**అశ్వాపురం, జూన్ 10, ప్రజాజ్యోతి**



అశ్వాపురం మండలం కేంద్రంలో గల వ్యాపారవేత్త, శివ కామేశ్వరి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా అశ్వాపురం మండల కేంద్రంలోని ఆరిఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పాలు, పండ్లు మరియు బ్రెడ్ పంపిణీ చేసిన శివ కామేశ్వరి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు. ఈ సందర్భంగా ఆరిఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమం రూపకర్త మాట్లాడుతూ.. ఇలా ప్రతి సంవత్సరం వారు పుట్టినరోజుకే కాకుండా ప్రమాదాలకు గురైన ఎన్నో కుటుంబాలను, కరోనా, వరదలు లాంటి విపత్తు సమయంలోను ఎన్నో కుటుంబాలను ఆదుకున్న మంచి మనసున్న వ్యక్తి, ఎవరికైనా ఆపద ఉన్నది అంటే ముందుగా స్పందించి సహాయం చేసే వారిలో దోసపాటి వారు ముందు వరుసలో ఉంటారని అలాంటి వారిని వారి కుటుంబ సభ్యులను భగవంతుడు చల్లగా దీవించాలని కోరుకుంటున్నానని తెలియజేశారు.

# విత్తనాలను బ్లాక్ లో అమ్మితే కఠిన చర్యలు



**ఇల్లెందు, జూన్ 10, ప్రజాజ్యోతి:**

విత్తనాలు కృత్రిమ కొరత ఏర్పరిచి విత్తనాలను బ్లాక్‌లో అమ్మితే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని కొత్తగూడెం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు డి.రమేశ్ హెచ్చరించారు. సోమవారం ఇల్లెందు పట్టణంలోని విత్తన దుకాణాల్లో ఇంటర్నల్ స్క్వాడ్ బృందం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలను బ్లాక్ చేస్తున్నట్టు కానీ, ఎంఆర్పీ కన్నా అధిక రేట్లలకు అమ్ముతున్నట్లు ఫిర్యాదులు వస్తే ఆ డీలర్.. డీలర్ షిప్ రద్దు చేస్తామన్నారు. గ్రామాలకు వచ్చి ఎవరైనా విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన దుకాణాలలో మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన విత్తనాలకు రైతులు తప్పనిసరిగా బిల్లులను తీసుకోవాలని సూచించారు. తీసుకున్న బిల్లులపైన లాట్ నెంబరు, తీసుకున్న తేదీ, రైతు వివరాలు ఉండేలాగా చూసుకోవాలని తెలిపారు. అదేవిధంగా రైతులు ఒకే కంపెనీ విత్తనాలు కాకుండా తమ పొలంలో రెండు, మూడు రకాల కంపెనీల విత్తనాలు వేసుకుంటే ఇబ్బంది ఉండదన్నారు. బిల్, విత్తనాల ప్యాకెట్‌లను పంట కాలం అయిపోయేంత వరకు రైతులు జాగ్రత్తగా భద్రపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఇబ్బందులకు గురి చేసే వారిపై చర్యలు తీసుకోవాలి :ప్రగతిశీల రైతు సంఘం

**దుమ్ముగూడెం, జూన్ 10, ప్రజాజ్యోతి**



దుమ్ముగూడెం మండలం తాసిల్దార్ కి వినతి పత్రం ఇచ్చిన ప్రగతిశీల రైతు సంఘం భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు సున్న వీరభద్రం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో రైతులకు కావలసినన్ని విత్తనాలు, ఎరువులు పూర్తి సబ్సిడీకి ఇవ్వాలని, రైతులకు రుణమాఫీ రెండు లక్షలు అమలు చేయాలని, వ్యవసాయానికి ట్రాక్టర్లు సబ్సిడీలో ఇవ్వాలని, ఫెర్టిలైజర్ షాపుల్లో కల్తీ విత్తనాలు అమ్మిన వారిపై చర్య తీసుకుని లైసెన్సు రద్దు చేయాలని, ప్రభుత్వ నిషేధిత ఎరువులు అమ్మిన వారిపై చర్య తీసుకోవాలని, పెట్లేజర్ షాపుల్లో పెట్టుబడి తీసుకున్న రైతులకు పెట్టుబడి పెట్టిన షాపు యజమాని రైతుకు ఎరువులు విత్తనాలు ఇచ్చిన వెంటనే బిల్లు చెల్లించాలని, చెల్లించని ఎడల వారిపై ప్రభుత్వం చర్య తీసుకోవాలని, బ్యాంకుల్లో కొత్త రుణాలు ఇవ్వాలని, రుణాలు ఇచ్చేముందు డ్వాక్రా అప్పులకు సంబంధం లేకుండా బ్యాంకుల సిబ్బంది రైతులను ఇబ్బంది పెట్టకుండా కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం భద్రాచలం డివిజన్ కార్యదర్శి సాయన్న పార్టీ మండల నాయకులు రామ్ శెట్టి కుంజ కన్నయ్య పునీసు లక్ష్మి కారం శీను ముదిరాజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు ఇట్లు ప్రగతిశీల రైతు సంఘం భద్రాచలం డివిజన్ అధ్యక్షులు సున్నం వీరభద్రం.

# ఆపరేటర్ల పదోన్నతులపై చర్యలు చేపట్టాలని వినతి

**మణుగూరు, జూన్ 10, ప్రజాజ్యోతి**



ఎన్నికల కమిషన్ విధించిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎన్నికల కోడ్) ముగిసినందున ఈపీ ఆపరేటర్ల పదోన్నతులకు సంబంధించి చర్యలు చేపట్టాలని కోరుతూ మణుగూరు ఏరియా ఈపీ ఆపరేటర్ల ఆధ్వర్యంలో సోమవారం ఏరియా ఇన్ ఛార్జ్ ఎస్ఓజిఎం వెంగళరావుకి ఆపరేటర్ల సంతకాల సేకరణతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆపరేటర్స్ నాయకులు యస్ డి నాసర్ పాషా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ గడువు ముగిసినందున ఈపీ ఆపరేటర్ల పదోన్నతులకు సంబంధించి ఇప్పటికే అర్హత పరీక్షలు నిర్వహించి ఉన్న ఏ గ్రేడ్, బి గ్రేడ్ ప్రమోషన్స్ ఆర్డర్ కాపీలు బ్యాక్ డేట్ తో కలిపి వెంటనే ఆపరేటర్లకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం రీజియన్ తో పాటు సింగరేణి వ్యాప్తంగా ఓసి గనులలో పనిచేస్తున్న రెండు సంవత్సరాల సర్వీసు పూర్తి అయిన ఆపరేటర్లకు సంబంధించి సీ గ్రేడ్ టెస్ట్ లు నిర్వహణా జాప్యం కారణంగా వారు ఉద్యోగొన్నతి తో పాటు ఆర్థికంగా కూడా నష్టపోతున్నారని అన్నారు. ఎక్స్ కా వేషన్ సి గ్రేడ్ ఖాళీల భర్తీకి కూడా సత్వర చర్యలు చేప ట్టాలని ఆయన సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. అదేవిధంగా కొత్తగూడెం రీజియన్ స్థాయిలో అర్హులైన బి గ్రేడ్ ఆపరేటర్లకు బ్యాక్ డేట్ ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ నరేష్, సతీష్ పాల్గొన్నారు.

# బీటెక్ కోర్సులో ప్రవేశానికై దరఖాస్తులు

**ఇల్లందు, జూన్ 10, ప్రజాజ్యోతి:**




యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకతీయ యూనివర్సిటీ కొత్తగుడెంలో బిటెక్ కోర్సు చేయుట కొరకు ఇల్లందు ఏరియా సింగరేణి అధికారుల మరియు ఉద్యోగుల పిల్లలకు దరఖాస్తులు కోరడం జరిగిందని ఏరియా జియం జాన్ ఆనంద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, కార్మికుల పిల్లలకు 10 సీట్లు అవకాశం ఉందని పేర్కొన్నారు. మైనింగ్ ఇంజనీరింగ్ 2, కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ (సిఎస్ఈ) 2, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) 2, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) 2, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసిఈ) 2 సీట్లు ఉన్నట్టు తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి తెలంగాణా రాష్ట్రం నిర్వహించిన టిజి ఏప్ సెట్ ఉత్తీర్ణులై ఉండాలని, ధరఖాస్తులో హాల్ టికెట్ నెంబర్, ర్యాంక్ స్పష్టంగా నమోదు చేయాలని, ధరఖాస్తులో 2024-25 టిజి ఏప్ సెట్ మెరిట్ జిరాక్స్ కాపీ సమర్పించాలని, ధరఖాస్తులో కుల ధ్రువీకరణ పత్రం, స్థానికం అండ్ నాన్-లోకల్ సమర్పించాలన్నారు. కౌన్సిలింగ్ సమయంలో ఉద్యోగి యొక్క ఐడి కార్డును సమర్పించాలని, కౌన్సిలింగ్ లో ఎంపికైన అభ్యర్థులు ప్రవేశ రుసుము వెంటనే చెల్లించాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ యొక్క దరఖాస్తులను జూన్ 30 లోపు అందజేయాలని తెలిపారు.

## నూతన చట్టాలపై శిక్షణా తరగతులు



భద్రాచలం,జూన్ 10,ప్రజాజ్యోతి.

ఏఎస్‌పి భద్రాచలం వారి ఆదేశాల మేరకు నాగరాజు సిఐ మరియు పి.వి.ఎన్ రావు ఎస్ఐలు భద్రాచలం సబ్ డివిజన్ పరిధిలో గల పోలీస్ ఆఫీసర్స్‌కి జులై నుండి అమలులోనికి రానున్న నూతన చట్టాలు గురించి నాలుగు రోజులు శిక్షణ తరగతులును నిర్వహించడం జరిగింది. ఈ రోజు ఏ ఎస్ పి ముగింపు కార్యక్రమం లో పాల్గొని అందరికి సర్టిఫికెట్లు ప్రదానం చేసి, క్రొత్త చట్టాలు రావాల్సిన ఆవశ్యకత గురించి వివరించినారు. ఈ యొక్క ట్రైనింగ్ లో ప్రతిభ కనపరిచిన ఆఫీసర్స్ కి జ్ఞాపిక ఇచ్చి సత్కరించటం జరిగింది.







## లంక శివ కుటుంబ సభ్యులను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



దుమ్ముగూడెం, జూన్ 10,ప్రజాజ్యోతి

మండలంలో బిఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు లంక శివ తల్లి మరణించిన విషయం తెలిసిన అనంతరం వారి స్వగృహానికి వెళ్లి లంక శివని పరామర్శించించారు. భద్రాచలం మండల కాంగ్రెస్ నాయకులు బొంబోతుల రాజీవ్ , గాడి విజయ్, ఆకుల వెంకట్, గాడి రాజేష్‌లు పరామర్శించిన వారిలో ఉన్నారు.

# మహిళా చట్టాలను విస్మరిస్తున్న పాలకులు







ఇల్లందు, జూన్ 10,ప్రజాజ్యోతి:

మహిళా చట్టాలను పాలకులు విస్మరిస్తున్నాయని టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కవిత, పిఓడబ్ల్యూ అధ్యక్షులు వి. సంధ్య లు పేర్కొన్నారు. సోమవారం ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా క్లాసులను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం మహిళలపై వేధింపులు, దాడులకు పాలకులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా హక్కుల సాధన కోసం మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దేశంలో మోదీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక మహిళలపై దాడులు, అత్యాచారాలు, వేధింపులు పెరిగిపోయాయని, రేపిస్టులు, హంతకులను పాలకులు రక్షిస్తున్నారన్నారని ఆరోపించారు. పార్టీ పుస్తకాలు, ప్రసార సాధనాల్లో హిందుత్వ ఫాసిస్టు భావజాలాన్ని మహిళలకు ఎక్కిస్తున్నారని, వంటింటి కుందేలుగా మహిళలను మార్చి విధంగా పాలకుల విధానాలు ఉన్నాయని విమర్శించారు. విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అవకాశాలు కల్పించకుండా స్త్రీలను హిందుత్వ బ్రాహ్మణీయ భావజాలాన్ని బుర్రలోకి ఎక్కించి కర్మగా చిత్రీకరిస్తున్నారని విమర్శించారు. సమ్మక్క,సారక్క, చింతా లక్ష్మీ, రాయల జ్యోతి, స్నేహలత తదితర ఎందరో మహిళలు పురుషాధిపత్యానికి వ్యతిరేకంగా భూస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా సామ్రాజ్యవాద విశ్వసంస్కృతికి వ్యతిరేకంగా సమానత్వం కోసం ఎన్నో ఉద్యమాలు నిర్వహించి తమ జీవితాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. స్త్రీ, పురుష సమానత్వం కోసం భూస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న మహిళా వివక్షత, అణిచివేతకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రదర్శన నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రముఖ హేతువాద సంఘ నాయకులు జీడి.సారయ్య, మున్సిపల్ కౌన్సిలర్ రెళ్ళ నాగలక్ష్మి, నాయకులు సంధ్య, సున్నం భూలక్ష్మి, కొడెం రాధ, భూక్య చిన్ని, పద్మ, మేఘన, సూర్యకాంత తదితరులు పాల్గొన్నారు.

# ఏరియా ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలి




భద్రాచలం, జూన్ 10,ప్రజాజ్యోతి

భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐద్వా పట్టణ కార్యదర్శి డి సీతాలక్ష్మి డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి దారిశెట్టి సతీష్ బాబు లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఐద్వా డివైఎఫ్ఐ భద్రాచలం పట్టణ కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీతాలక్ష్మి సతీష్ బాబులు మాట్లాడుతూ .నాలుగు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్నటువంటి అతి పెద్ద ఏరియా హాస్పిటల్ లో 76 మంది డాక్టర్స్ ఉండాలి కానీ ప్రస్తుతం 17 మంది డాక్టర్స్ మాత్రమే ఉన్నారని అన్నారు. ఏజెన్సీ కేంద్రమైన ప్రభుత్వ ఏరియా హాస్పటల్లో 17 మంది డాక్టర్స్ సరిపోవటం లేదు ముఖ్యంగా మహిళలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డెలివరీకి వచ్చిన మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రస్తుతం గైనకాలజిస్ట్ డాక్టర్ ఒక్కరూ మాత్రమే ఉన్నారని ,ఆ డాక్టర్ ప్రస్తుతం ఉదయం మాత్రమే హాస్పటల్లో ఉంటున్నారని నైటు వచ్చిన డెలివరీ మహిళలు చాలా ఇబ్బందులకి గురి అవుతున్నారని ఆరోపించారు. డెలివరీకి వచ్చిన మహిళలను కొత్తగూడెం దగ్గర ఉన్నటువంటి రామవరం గవర్నమెంట్ హాస్పిటల్ కి పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పురిటి నొప్పులతో బాధపడే గర్భిణీ మహిళలు అక్కడికి వెళ్లాలంటే ప్రత్యక్ష నరకాన్ని అనుభవిస్తున్నారని అన్నారు. అదేవిధంగా వర్షాకాలం జ్వరాల సీజన్ ముఖ్యంగా డెంగ్యూ ,మలేరియా లాంటి విషపూ జ్వరాలకు సీజన్. ఈ సీజన్ మొదలవుతున్న నేపథ్యంలో వెంటనే ప్రభుత్వ పెద్దలు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరతను తీర్చి సరిపోను సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్పందించి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమస్యలను పరిష్కరించకపోతే మహిళా సంఘం డివైఎఫ్ఐ తో పాటు ఇతర ప్రజాతంత్ర సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి డి సీతాలక్ష్మి ,జిల్లా నాయకురాలు ఎన్ లీలావతి, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి దారిశెట్టి సతీష్ బాబు, మాజీ టౌన్ నాయకులు సంతోష్ కుమార్ ,ఐద్వా ఆఫీసు బెర్రర్స్ రాదా, టౌన్ కమిటీ సభ్యులు డి కనక శ్రీ, నాగలక్ష్మి ,ఎస్కే ఆలీమా, వై పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులు పూర్తి

### తీరునున్నా ఎన్నో ఏళ్ల కల
### కాలుష్య సమస్యలకు చెక్



భద్రాచలం,జూన్ 10,ప్రజాజ్యోతి.

గత కొన్ని ఏళ్లుగా భద్రాచలం పట్టణ వాసులు డంపింగ్ యార్డ్ లేక పడుతున్న అనేక కాలుష్య సమస్యలకు చెక్ పెట్టెందుకు ఇటీవల చేపట్టిన డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులు పూర్తయి, అతి త్వరలో అందుబాటు లోకి రానుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు. పట్టణ శివారు లోని మనుబోతుల చెరువు సమీపాన 8 ఎకరాల స్థలంలో చేపట్టిన నిర్మాణం తుది దశకు చేరింది. మరో వారం రోజుల్లో డంపింగ్ యార్డ్ అందుబాటు లోకి రానున్న నేపథ్యంలో గోదావరి కరకట్ట వెంట చెత్తాచెదారం వేస్తూ ఉండటంతో ఏర్పడుతున్న కాలుష్య సమస్యకు పరిష్కారం లభించినట్లు అయింది. దీనితో గత పది సంవత్సరాలుగా ఈ ప్రాంత వాసులు డంపింగ్ యార్డ్ కల తీరనున్నది. భద్రాచలం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సుమారు 80 లక్షల వ్యయంతో ఎకరం స్థలంలో డంపింగ్ యార్డ్ ను నిర్మిస్తున్నారు.. ఇందులో 40 లక్షలతో వర్మీ కంపోస్ట్, 35 లక్షలతో డీఆర్‌సీసీ షెడ్ల నిర్మాణం జరుగుతుంది. కాగా డంపింగ్ యార్డ్ లో క్రషింగ్ మిషన్ రావాల్సి ఉంది. పస్తుతం భద్రాచలం పట్టణంలోని 19 వార్డుల నుంచి 30 పంచాయతీ వాహనాల ద్వారా రోజు 15 టన్నుల మేర పొడి, తడి చెత్త సేకరిస్తున్నారు. కాగా కొత్తగా ఏర్పాటు చేసే డంపింగ్ యార్డ్ లో పొడి చెత్తను వేరు చేసి, క్రష్ చేసే 40 లక్షల విలువైన యంత్రాన్ని ఐటిసి పేపర్ పరిశ్రమ ఇవ్వనుంది. ఇతర నిర్మాణాలకు 40 లక్షలను గ్రామపంచాయతీ వెచ్చిస్తుంది. ఇవే కాక డంపింగ్ యార్డ్ కి కావలసిన ఇతర యంత్రాలను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కోటి రూపాయల వ్యయంతో కొనుగోలు చేయనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా డంపింగ్ యార్డ్ కోసం అందుబాటు లో ఉన్న ఎనిమిది ఎకరాల్లో ఎకరంనర నిర్మాణాలకు ఉపయోగించి, మిగిలిన స్థలంలో విస్తృతంగా మొక్కల పెంపకం చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన స్థలంలో విస్తృతంగా మొక్కల పెంపకం చేపడితే దాదాపు 50 మంది వరకు ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నారు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం భద్రాచలం మండలంలో పట్టణానికి ఆనుకొని ఉన్న పంచాయతీలు ఆంధ్రాలో కలిసి పట్టణం మాత్రమే మిగలగా.. చుట్టూ ఉన్న ప్రాంతమంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వీలీనమైంది. విభజనకు ముందు భద్రాచలంలో సేకరించే చెత్తను సరిహద్దున ఉన్న ఎటపాక మండల కేంద్రంలో డంపు చేసేవారు. రాష్ట్ర విభజన అనంతరం అక్కడి ప్రజలు చెత్త డంపింగ్ను అడ్డుకోవడంతో, కూనవరం రోడ్డులో డంపింగ్ యార్డ్ కోసం ఎక్కడ స్థలం కేటాయించినా కూడా అక్కడి రైతులు వ్యతిరేకరించడంతో బూర్గంపాడు మండలం సారపాక లోని మణుగూరు క్రాస్ రోడ్ వద్ద కొంత స్థలం గుర్తించి అక్కడకు చెత్తను డంపు చేయాలని అధికారులు భావించి అందుకు ఏర్పాట్లు చేయగా.. అక్కడి స్థానికుల నుంచి కూడా వ్యతిరేకత రావటంతో, చివరికి చెత్తను గోదావరి కరకట్టపై ఏర్పాటు చేసిన తాత్కాలిక డంపింగ్ యార్డ్ వద్దకు చేర్చి తగలబెట్టుతుండటంతో ఇటు స్థానికులు ఇబ్బంది పడుతుండటమే కాక, గోదావరి జలాలు కాలుష్యం అయ్యే పరిస్థితి ఉందని తీవ్ర విమర్శలు వెలువడ్డాయి.. ఈ నేపథ్యంలో భద్రాచలం పట్టణానికి శివారు ప్రాంతమైన మనుబోతుల చెరువు వద్ద అధికారులు స్థలం కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభించారు..

మొత్తానికి అధికారుల పర్యవేక్షణలో భద్రాచలం పట్టణ వాసులకు ఎప్పటినుంచో తీరని కలగా ఉన్న డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులు అనుకున్నటైం కి పూర్తి అవటంతో ఈ ప్రాంత ప్రజలకు కాలుష్య సమస్య తీరినట్లేనని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సమ్మెకు దిగిన ఏరియా హాస్పిటల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు

## కాంట్రాక్టర్ ను బ్లాక్ లిస్టులో చేర్చి కాంట్రాక్టు రద్దు చేయాలి

### సీఐటియూ జిల్లా కార్యదర్శి ఏ.జే రమేష్



**భద్రాచలం, జూన్ 10, ప్రజాజ్యోతి**

భద్రాచలం ఏరియా హాస్పిటల్ నందు శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్, ఇంటెన్సివ్ కేర్ యూనిట్స్ లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్లో ఉన్న 4 నెలల వేతనాలు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి సమ్మె చేపట్టారు. సోమవారం తెల్లవారుజాము నుండి శానిటేషన్ పనులు నిలిపివేయడంతో ఎక్కడి కక్కడ శానిటేషన్ పనులు స్తంభించి పోయాయి. సమ్మె శిబిరాన్ని సిఐటి యు జిల్లా కార్యదర్శి ఏ జె రమేష్ ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల ఆకలి బాధలు ప్రభుత్వానికి పట్టడం లేదని అన్నారు. ప్రతి నెల 7వ తేదీ లోపు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని జీవోలో ఉన్నప్పటికీ సదరు కాంట్రాక్టర్ కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని, పిఎఫ్ ఈఎస్ఐ లకు సంబంధించిన వివరాలు ఎప్పటి కప్పుడు కార్మికులకు తెలియ చెప్పాల్సి ఉన్నప్పటికీ అలా చేయడం లేదని అన్నారు. కార్మికులకు రూ .15,600/- లు ఇవ్వాలని జీవోలో ఉన్నప్పటికీ కేవలం రూ. 11,000/- లు మాత్రమే ఇస్తున్నారని, చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు సక్రమంగా ఇవ్వక పోవడం దారుణమని అన్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్ ను బ్లాక్ లిస్టులో చేర్చి కాంట్రాక్టు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు జీతాలు సక్రమంగా నెల నెల చెల్లించకపోవడం వల్ల ఇంటి కిరాయిలు కట్టుకోలేక, పాలు, కిరాణా బాకీలు చెల్లించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా కార్మికులకు జీతాలు అందే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. సమ్మెతో శానిటేషన్ పనులు స్తంభించడంతో స్పందించిన హాస్పటల్ సూపరిండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ చొరవతో ఐటీడీఏ పీవో ఒక నెల వేతనం తక్షణమే మంజూరు చేయడం జరిగింది. హాస్పిటల్ చైర్మన్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు సమ్మె శిబిరానికి వచ్చి మిగతా రెండు నెలల పెండింగ్ వేతనాలు పది రోజులలో చెల్లించేందుకు కృషి చేస్తామని, కాంట్రాక్టర్ ను పిలిపించి కార్మికులు, సిఐటియు నాయకులు సమక్షంలో ఈఎస్ఐ, పిఎఫ్ ఇతర సమస్యలపై చర్చిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా విరమించడం జరిగింది. ఇచ్చిన హామీలను 10 రోజులలో అమలు చేయకుంటే తిరిగి సమ్మె కొనసాగి స్తామని సిఐటియు సిఐటియు నాయకులు, కార్మికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, సిఐటియు నాయకులు బండారు శరత్ బాబు, పి సంతోష్ కుమార్, జి లక్ష్మీకాంత్, భూపేంద్ర ,రమాదేవి ,కృష్ణ భవాని ,సుల్తానా ,శ్రీకాంత్,పెద్ద రమణ, తదితరులు పాల్గొన్నారు. హాస్పిటల్ కార్మికుల సమ్మెకు ఐద్వా పట్టణ కమిటీ తమ సంఘీభావాన్ని తెలియజేసింది. ఐద్వా పట్టణ కార్యదర్శి డి లక్ష్మి పట్టణ ఆఫీస్ బేరర్స్ ఎన్. లీలావతి జి రాధా పట్టణ కమిటీ సభ్యులు కనక శ్రీ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రికి ఐదు డయాలసిస్ యూనిట్లు మంజూరి

## ఫలించిన ఎమ్మెల్యే కూనంనేని కృషి



**కొత్తగూడెం, జూన్ 10, ప్రజాజ్యోతి**

శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు కృషి ఫలించింది, నియోజకవర్గ పరిధిలోని రెండో ప్రధాన పట్టణమైన పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి డయాలసిస్ యూనిట్లు మంజూరి చేయాలని సంబంధిత శాఖ మంత్రికి, శాఖ రాష్ట్ర అధికారులపై వత్తిడి చేసిన ఫలితంగా ఐదు యూనిట్లతోకూడిన డయాలసిస్ కేంద్రాన్ని మంజూరి చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం జిల్లాకేంద్రంలోని కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో ఐదు డయాలసిస్ మిషన్స్ మాత్రమే అందుబాటులో ఉండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురిఅవుతుండటంతో, గుర్తించిన ఎమ్మెల్యే కూనంనేని గత మర్చి నెలలో లేఖ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రభుత్వం స్పందించి పాల్వంచ ఆస్పత్రికి ఐదు మిషన్లు మంజూరి చేసింది. త్వరలో వీటి ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నారు. ఒక్కో రోగికి ఒక్కసారి డయాలసిస్ నిర్వహిస్తే రూ. 30 వేల నుంచి రూ. 50వేల వం-కు ప్రైవేటు ఆస్పత్రిలో వెచ్చించాల్సిన పరిస్థితిని అధిగమించి ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ సేవలు అందుబాటులోకి రావడంతో నిరుపేదలైన డయాలసిస్ రోగులకు ఊరట లభించినట్లైది. తన విజ్ఞప్తి, లేఖలపై స్పందించి ఐదు మిషన్లు మంజూరు చేయడంపట్ల రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర స్థాయి అధికారులకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం జిల్లా ప్రధాన ఆస్పత్రికి మరో ఐదు యూనిట్లు మంజూరి కోసం ప్రభుత్వంపై వత్తిడి తెస్తున్నట్లు, త్వరలో అదనపు యూనిట్లు మంజూరు అవుతాయని తెలిపారు. పేదవర్గాలకు వైద్య సేవలందిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసేందుకు ప్రేత్యేక దృష్టి సారించినట్లు కూనంనేని తెలిపారు.

# ఉపాధి హామీ పనిలో అవకతవకలకు పాల్పడ్డ అధికారులను సస్పెండ్ చేయాలి

## సీపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజా పంథా) పార్టీ చర్ల మండల కమిటీ



**చర్ల, జూన్ 10, ప్రజాజ్యోతి**

సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజా పంథా) పార్టీ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి అధికారులను గొంపల్లి గ్రామ ప్రజలు కలిసి ఉపాధి హామీ పనిలో జరిగిన అవకతవకలను వివరించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా పార్టీ చర్ల మండల కార్యదర్శి కొండ కౌశిక్ మాట్లాడుతూ చర్ల మండలంలోని గొంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో జరిగిన గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరిగాయని పనిచేసిన వారికి కాకుండా పనిచేయని వారికి కూడా పద్దులు వేశారని బిల్లులు చేశారని వివరించారు. సుమారుగా మూడు లక్షల వరకు తప్పుడు పద్దులు వేసి డబ్బులు కాజేశారని తెలిపారు. ఉపాధి హామీ అధికారులు సొమ్ము ఒకరిది సోకు ఒకరిదిగా వ్యవహరిస్తున్నారని అన్నారు పని ప్రదేశంలో కార్మికుల ముందు హాజరు వేయడం లేదని పని ప్రదేశంలో తెల్ల కాగితంపై పనికి వచ్చిన ఉపాధి కార్మికులతో సంతకాలు పెట్టించుకుని అధికారులు వారి ఇంటివద్ద వారికి నచ్చిన వారికి పనికి రాని వారికి కూడా మస్టర్ కాగితంపై హాజరు వేస్తున్నారని అన్నారు లక్షలలో అవకతవకలు జరిగాయని అన్నారు. ఇది జరిగి ఇప్పటికీ 15 రోజులు గడుస్తున్న తప్పు చేసిన అధికారులపై ఏమాత్రం చర్యలు తీసుకోలేదని అన్నారు. కరువు పని కోసం వెళ్లిన ఉపాధి కార్మికుల కష్టాన్ని దోచుకోవాలని చూడడం అట్లాంటి అధికారుల పట్ల పై అధికారులు మెతక వైఖరి వ్యవహరించడం సరైన పద్ధతి కాదు అని అన్నారు. అందుకని ఈ విషయంలో తమరు జోక్యం చేసుకొని తప్పుడు పద్దులు వేసిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని పనిచేయని వారికి ఖాతాలో పడ్డ డబ్బుని రికవరీ చేసి పని చేసిన కార్మికుల బ్యాంక్ అకౌంట్లో వెయ్యాలని తద్వారా ఉపాధి హామీ కార్మికులకు న్యాయం చేయాలని మళ్ళీ ఎప్పుడూ ఇట్లాంటి అవకతవకలు జరగకుండా పునరావృతంగా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల భవిష్యత్తులో ఈ సమస్య పరిష్కారం కోసం ఆందోళన పోరాటాలను ఉధృతం చేస్తామని అన్నారు.

**స్పందించిన ప్రజావాణి అధికారులు**

తప్పుడు పద్దులు వేసిన అధికారుల అందరినీ వారం రోజుల్లో సస్పెండ్ చేస్తామని కార్మికుల కష్టాన్ని వృధా పోనీయమని అవకతవకలు జరిగిన సొమ్ముని రికవరీ చేసి ఉపాధి పని చేసిన కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని అన్నారు. ఉపాధి కార్మికులు ఎవరు ఆందోళన చెందవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ చర్ల మండల నాయకులు చెన్నం మోహన్, గొంపల్లి గ్రామస్తులు పున్నారావ్, వెంకటరమణ, బాబు రావు, నరసింహ మూర్తి, నగేష్, సీత, మంగవేణి, నాగమణి, శోభారాణి, సూరమ్మ, పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల గురించి పంచాయతీ అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే



**భద్రాచలం, జూన్ 10, ప్రజాజ్యోతి**

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భద్రాచలం మండల సమస్యలపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస రావుతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటు న్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు. అంబా సత్రం ఏరియాలో రహదారులకు లేక ఇబ్బందులు పడుతున్నారని కాలనీ వాసులు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన డాక్టర్ తెల్లం వెంకట్రావు పంచాయతీ కార్యదర్శి తో మాట్లాడి ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రత్నం రమాకాంత్, కొండిశెట్టి కృష్ణమూర్తి, బొంబోతుల రాజీవ్, నర్రా రాము అరికెల తిరుపతిరావు, తాళ్లపల్లి రమేష్ గౌడ్, తాళ్ల రవి, మండల కార్యదర్శి దొడ్డిపట్ల కోటేష్, కార్మిక శాఖ అధ్యక్షులు చుక్క సుధాకర్, మాజీ గ్రంథాలయ చైర్మన్ మామిడి పుల్లారావు, చింతాడి రామకృష్ణ యూత్ నాయకులు గాడి విజయ్, పుల్లగిరి నాగేంద్ర, గాడి రాజేష్, జామిర్, తాజ్ పాల్గొన్నారు.

# కొత్తగూడెం మున్సిపాలిటీలో విలీనమైన ఏజెన్సీ ప్రాంతాన్ని తొలగించాలి

**పీసా చట్టం ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతంలో పంచాయతీ రాజ్ చట్టాలు అమలు చేయాలి**

**చిట్టిరామవరం తండా పేద కుటుంబాలకు 100 రోజుల పని పథకం అమలు చేయాలి**

**మున్సిపల్ ఎన్నికలను రద్దుచేసి గ్రామపంచాయతీ ఎన్నికలు జరపాలి**



**కొత్తగూడెం, జూన్ 10, ప్రజాజ్యోతి**

కొత్తగూడెం మున్సిపాలిటీలో విలీనమైన ఏజెన్సీ ప్రాంతాన్ని తొలగించాలని 11వ వార్డు చిట్టిరామవరం తండాకు చెందిన గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన స్వామి లకు అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. అనంతరం గిరిజన నాయకులు రాంబాబు, రాజ్ కుమార్, పూర్ణచందర్, శ్రీనివాస్ నాయక్ మాట్లాడారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో మునిసిపల్ చట్టాలను అమలు చేయడం సరికాదన్నారు. పిసా చట్టం ప్రకారం పంచాయతీరాజ్ చట్టాలను అమలుపరచి పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. మొత్తం చిట్టిరామవరం తండాలో 330 గిరిజన కుటుంబాలు నివసిస్తుంటే అందులో 290 కుటుంబాలు దారిద్ర్యరేఖకు దిగువన ఉండి తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉన్నారని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉంటూ 100% గిరిజన జనాభా కలిగి, 290 రేషన్ కార్డులు కలిగిన పేద కుటుంబాలకు వంద రోజుల పని పథకం అమలు చేయాలన్నారు. రామవరం ఏజెన్సీ ప్రాంతంలో ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. పై అంశాలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని తెలిపారని అన్నారు. వచ్చే మున్సిపల్ సమావేశాలను అడ్డుకుంటామని, మునిసిపల్ ఎన్నికలను 11వ వార్డు నుండి బహిష్కరిస్తామని వారు ప్రకటించారు. ఇప్పటికే గ్రామ ప్రజల సమక్షంలో ఎన్నికల బహిష్కరణకు సంబంధించిన తీర్మానం చేసుకున్నామని స్పష్టం చేశారు.

# నిర్లక్ష్యంతో నీరు వృధా


### -పట్టించుకునేవారేలేరా...!



**టేకులపల్లి, జూన్ 10, ప్రజాజ్యోతి**

మండలంలోని గోలియా తండా పంచాయితీ బీకాలనీలో మిషన్ భగీరథ ట్యాంక్ నీటి పైపు పగిలి వృధాగా పోతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారు. మండల ప్రజా పరిషత్ అధికారి, గ్రామపంచాయతీ కార్యదర్శిలకు తెలియజేసిన ఎలాంటి ప్రయోజనం లేదు. పైపును సరి చేయడానికి గొయ్యి తీసి వారం రోజులు అవుతున్న ఎవరు పట్టించుకోవట్లేదని, పైపు నుంచి వచ్చే నీరు ఇళ్లల్లోకి వెళ్లి ఇంటిలో బురదమయం అవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించగలరని బి కాలని తండ ప్రజలు కోరుకుంటున్నారు.

# ఖాజా గౌస్, మండల రాములకు ఘన సన్మానం



**ఇల్లందు, జూన్ 10, ప్రజాజ్యోతి**

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పంజాబ్ రాష్ట్రానికి కో అబ్జర్వర్ గా నియమితులై కాంగ్రెస్ అభ్యర్థి ఎంపీగా గెలుపు కోసం తన వంతు కృషి చేసిన యండి ఖాజ గౌస్ మొహీనుద్దీన్, ఇల్లందు మండల వైస్ యంపిపిగా ఎన్నికైన మండల రామ్ మహేష్ లను సోమవారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. రానున్న రోజుల్లో మరెన్నో పదవులను సాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్, ఐఎన్టియుసి సెంట్రల్ నాయకులు మహబూబ్, కాంగ్రెస్ నాయకులు ముడుగు సాంబమూర్తి, భోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, జాఫర్, గొపగాని రాజు గౌడ్, మాహమ్మద్ అప్సర్, కొండే సైదులు, నిర్మల, సరోజ, కవిత, ఈశ్వర్ గౌడ్, దుబాయ్ శ్రీనివాస్, హియమ్, కమల్ కోరి పాల్గొన్నారు.

# శ్రీ వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు



**చర్ల, జూన్ 10, ప్రజాజ్యోతి**

చర్ల మండలం అంబేద్కర్ నగర్ వీధిలో పొనగంటి వంశానికి తరతరాలగా ఆనవాయితీగా వస్తున్న ఇలవేల్పు శ్రీ వీరభద్ర స్వామి కి ప్రత్యేక పూజలను , మేళతాలతో డప్పు వాయిద్యాలతో వీరభద్ర స్వామికి నది నీళ్లను, తీసుకొచ్చి వీరతాడు, త్రిశూలంను ,ఉపవాసం ఉండి మట్టి కుండలో పొనగంటి వంశీయులు భద్రపరుస్తారు. ఏ ప్రాంతంలో ఉన్న పొనగంటి వంశానికి చెందిన ఆడబిడ్డలు, వారి పిల్లలు, వంశీయులందరూ ఒక చోట చేరుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టి జయప్రదం చేస్తారు. అందులో భాగంగానే చర్ల మండలం అంబేద్కర్ నగర్ కాలనీలో ఘనంగా శ్రీ వీరభద్ర స్వామికి పొనగంటి వంశీయులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో పోనగంటి రాజా, వెంకటి, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

# ముచ్చటగా మూడోసారి మోదీ ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం

### బీజేపికి నీరాజనం పట్టిన దేశప్రజలు..

### బీజేపి మండల అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్

**అశ్వారావుపేట, జూన్10, ప్రజాజ్యోతి**





పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలు భారతీయ జనతా పార్టీకి నీరాజనం పట్టారని, ముచ్చటగా మూడోసారి మోదీ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం శుభ పరిణామని బీజేపి మండల అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడం, మోడీ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడన్ని హర్షిస్తూ ఆ పార్టీ నాయ కులు, కార్యకర్తలు సోమవారం పట్టణంలోని బస్టాండ్ సెంటర్, వివేకానంద కూడలిలో బాణాసంచా కాల్చి మి ఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లోను బీజేపీకి ప్రజలు సంపూర్ణంగా మద్దతు పలికారని, మోదీ కా పరివార్, ఉపాధిహామీ పథకాలు క్షేత్రస్థాయిలోని ప్రజల్లో విస్తృతంగా వెళ్లాయన్నారు. గడపగడపకు శ్రీరాముని అక్షింతలు వెళ్లాయని, తెలంగాణ రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గట్టి పోటీ ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అయినా ప్రజలకు ఎలాంటి పథకాలు అమలు చేయకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు డేగల రామచంద్రరావు, బీజేపి నాయకులు చవ్వ రమేష్, శివకుమార్, గొట్టాపు వెంకట అప్పారావు, యశోద కళ్యాణ్, కాకి రాము,కలకోటికృష్ణ ,కలకోటి వెంకటేశ్వరావు, పుష్కార కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# గోదావరినదిలో స్నానానికి వెళ్ళి తల్లి, కొడుకు మృతి



**అశ్వారావుపేట, జూన్10, ప్రజాజ్యోతి**

గోదావరినదిలో స్నానానికి వెళ్ళి తల్లి, కుమారుడు మృతి చెందిన సంఘటన ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం కట్కూరు వద్ద చోటు చేసుకుంది. వివరాలీల ఉన్నాయి. అశ్వారావుపేట చిన్నంశెట్టి బజార్ కు చెందిన ఓ కుటుంబం 14 మంది కలిసి కటుకురులోని శివాలయానికి దైవదర్శనం కోసం వెళ్లారు. అది గోదావరి పరివాహక ప్రాంతం కావడంతో స్నానం చేసేందుకు వెళ్ళారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అల్లంశెట్టి నాగమణి(48) ఆమె కుమారుడు తేజ శ్రీనివాస్(23) గోదావరిలో గల్లంతయ్యారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# జూలూరుపాడులో బడిబాట ర్యాలీ





**జూలూరుపాడు, జూన్10, ప్రజాజ్యోతి**

బడిబాట కార్యక్రమంలో భాగంగా జూలూరుపాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, బచ్చల కొయ్యగూడెం, రాజారావు పేట వెంగన్నపాలెం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఎంపీడీవో కరుణాకర్ రెడ్డి, మండల నోడల్ ఆఫీసర్ సంజీవరావు, వెలుగు సిబ్బంది, మండలంలోని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా ఉచిత దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం జూలూరుపాడు ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి గుండెపుడి క్రాస్ రోడ్ లోని అంబేద్కర్ విగ్రహం వరకు బడిబాట ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రైవేటు బడులకు ధీటుగా ప్రభుత్వ బడుల్లో విద్య బోధన జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో, ఎంపీడీవో కరుణాకర్ రెడ్డి, నోడల్ అధికారి సంజీవరావు, మండలంలోని గెజిటెడ్ ప్రధానఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

# విత్తనాల షాపులను తనిఖీ చేసిన వ్యవసాయ సంచాలకులు

**జూలూరుపాడు, జూన్10, ప్రజాజ్యోతి**



ఇల్లందు సహాయ వ్యవసాయ సంచాలకులు పి. వాసవి రాణి టాస్క్ ఫోర్స్ లో భాగంగా, జూలూరుపాడు మండలం లో వెంగన్నపాలెం , కొమ్ముగూడెం, గుండెపూడి గ్రామాల్లో ఉన్న విత్తన దుకాణాలు తనిఖీ చేయడం అయినది. విత్తన స్టాక్ తో పాటు ఉండాల్సిన పత్రాలు, రైతులకు విత్తనాలు అమ్మిన రిజిస్టర్లు, బిల్ బుక్స్ తనిఖీ చేసారు. అదే విధంగా రైతులు ఒకే రకం విత్తనాలు కోసం పడిగాపులు పడకుండా అన్ని రకాల విత్తనాలు కొనుగోలు చేయాలని,మంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఏ రకం బిజీ –2 రకమైనా మంచి దిగుబడులు వస్తాయని సూచించారు. ఈ తనిఖీలలో జూలూరుపాడు మండల వ్యవసాయ అధికారి శ్రీమతి ఎస్. రఘు దీపిక పాల్గొన్నారు.



# నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలి

### ఫలితాల్లో అవకతవలపై అనుమానాలున్నాయి

### ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ

**జూలూరుపాడు, జూన్ 10, ప్రజాజ్యోతి**

దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మే 5న దాదాపు దేశవ్యాప్తంగా 24 లక్షల మంది పరీక్షను రాశారని, ప్రకటించిన ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం, వారి పరీక్ష కేంద్రం ఒక్కటే కావడం అనుమానాలకు బలాన్నిస్తుందన్నారు. ఫలితాలపై, పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని వంశీ డిమాండ్ చేశారు.